క్లుప్తంగా

పన్నులను వందశాతం వసూలు చేయాలి



సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, నీటి పన్నులను వందశాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయ హాలులో ఆయన మున్సిపల్ ఇంజనీర్ చిదానందరెడ్డి, మున్సిపల్ రెవెన్యూ అధికారి మునికుమార్‌లతో కలిసి సచివాలయ కార్యదర్శులకు సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆస్తి, నీటి పన్నులను తప్పకుండా వసూలు చేయాలని, వందశాతం వసూళ్లకు కష్టపడాలన్నారు. అనంతరం అధికంగా పన్నులు వసూలు చేసిన సచివాలయ కార్యదర్శులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దునూరు రోడ్డుకు వెళ్లే దారిలో వాసవీకాలనీ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ కూలిపోయింది. దీంతో పశువులు, పందులు లోపలికి వెళ్లే అవకాశం ఉంది. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు ఏర్పాటు చేసిన దిమ్మె కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది. అక్కడ ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రాథమిక పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో డీఈఓ మీనాక్షి

కొండాపురం : మండలంలోని కొండాపురం జెడ్పీ ఉన్నతపాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మెయిన్, సీఎంఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను గురువారం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ యు.మీనాక్షి ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో వెనుకబడిన పిల్లలకు ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌లో ఉపాధ్యాయులు శిక్షణ పొందిన అంశాలను పిల్లలకు నేర్పించవలసినదిగా సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు నేర్చుకున్న విద్యాప్రమాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఓబులేసు, రామయ్యలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ జరగకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

జమ్మలమడుగు : శిశువుల లింగ నిర్ధారణ జరగకుండా అరికట్టేబాధ్యత అందరిపై ఉందని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ లెవల్ మల్టీమెంబర్ అథారిటీ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లపైన, ఆసుపత్రులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యానేరం అన్నారు. ఆసుపత్రుల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లు కేవలం కడుపులో పిల్లల ఎదుగుదలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. ఆడపిల్లల పట్ల నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజేశ్వరిదేవి, తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప నగరంలోని అమ్మవారిశాల వద్ద భక్తులు వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయం వద్ద ప్రత్యేకంగా తాత్కాలిక పుష్కరిణి ఏర్పాటు చేస్తున్నారు. నిపుణులైన ఇంజనీర్ల ఆధ్వర్యంలో 40 ఇన్‌టు 20 సైజులో పుష్కరిణి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో తెప్పను ఏర్పాటు చేసి అందులో అమ్మవారిని ప్రతిష్ఠించి తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం తెప్పను ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. ఆదివారం నాటికి తెప్ప సిద్ధం కానుందని నిర్వాహకులు తెలిపారు.

నమ్మిన వారికి కొంగు బంగారం శ్రీగంగమ్మ దేవత

● 9న గంగమ్మ తిరునాల



పెద్దకుడాల గ్రామంలోని శ్రీగంగమ్మ దేవాలయం



పెద్దకుడాల గ్రామంలో వెలసిన శ్రీగంగమ్మ దేవత

లింగాల : మండలంలోని పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల్లో వెలసిన శ్రీగంగమ్మదేవత నమ్మిన వారికి కొంగు బంగారంలా, కోరిన కోరికలు తీర్చే అమ్మలా అలరారుతున్నది. మహాశివరాత్రి రోజున గంగమ్మ దేవతలకు కంకణదారణగావించి తిరుణాలకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేస్తున్నారు. ఆలయాల చరిత్రలోకి వెలితే పూర్వం పెద్దకుడాలి, చిన్నకుడాలి అనే ఇద్దరు గొర్రెల కాపరులు ఈ ప్రాంతానికి వలస వచ్చారు. పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల మధ్య మోతకల వంక జీవనదిలా ప్రవహిస్తుండేది. గొర్రెలకు పశుగ్రాసం పుష్కలంగా లభిస్తుండటంతో ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. వారి వెంట గంపలలో గంగమ్మ దేవతను కూడా తీసుకొచ్చారు. అన్నదమ్ములకు మనస్పర్థలు రావడంతో పెద్దకుడాల గ్రామంలో పెద్దకుడాలి, మోతకల వంకకు అవతల ఒడ్డున చిన్నకుడాల గ్రామంలో చిన్నకుడాలి నివాసాలు ఏర్పరుచుకున్నారు. వారి వెంట తెచ్చుకున్న గంగమ్మ దేవతల ప్రతిమలను ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించి చిన్నపాటి గుడిని నిర్మించుకున్నారు. వారి పేర్ల మీదనే ఆయా గ్రామాలు వెలిశాయని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

దినదినాభివృద్ధి చెందిన ఆలయాలు

పూర్వం చిన్నపాటి గుడిగా ఉన్న గంగమ్మ దేవత ఆలయాలు దినదినాభివృద్ధి చెంది భారీ దేవాలయాలుగా వెలిశాయి. అమ్మవారికి భక్తులు భారీగా పెరిగిపోయారు. దీంతో అమ్మవారు భక్తుల కోరికలు తీర్చడంతో విరాళాలు అందించి ఆలయాలను అభివృద్ధిపరిచారు.

అమ్మవారు ఉన్నారని సజీవ సాక్ష్యం

పెద్దకుడాల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని అవమానించారని దీంతో ఆయన కుటుంబం సర్వం కోల్పోయిందని, దీంతో అమ్మవారి ఆగ్రహానికి గురైన ఆ కుటుంబం వంశం లేకుండా నిర్వీర్యమైపోయిందన్నారు. దీంతో అమ్మవారి ఆగ్రహాన్ని తగ్గించేందుకు ఆలయానికి పక్కనే మరో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అభివృద్ధి చేసి నేడు ఆ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది.

9న గంగమ్మ తిరునాల

ఈనెల 9వ తేదీన ఆదివారం ఆయా గ్రామాల్లోని శ్రీగంగమ్మ దేవత తిరుణాల నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. తిరుణాల సందర్భంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తేరుపై ఉంచి పెద్దకుడాల గ్రామంలో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ తిరునాలకు సింహాద్రిపురం, తొండూరు, వేముల, పులివెందుల మండలాల ప్రజలేకాక అనంతపురం, కర్ణాటక ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలి రానున్నారు. తిరునాల సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తిరునాల రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా లింగాల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆయా గ్రామాలకు పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

కమలాపురం : ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఫిజిక్స్ ఒప్పంద అధ్యాపకుడు తిరుపతిరావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం కమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యను బోధించాల్సిన అధ్యాపకుడు విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడటం దుర్మార్గ చర్య అని ఆయన తీవ్రంగా ఖండించారు. తిరుపతిరావుపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

హుండీ లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవాదాయశాఖ నుంచి కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఇన్‌స్పెక్టర్ జి.రమణమ్మ హాజరయ్యారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో హుండీల సొమ్మును ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. గత సెప్టెంబరు 11 నుంచి ఇప్పటి వరకు హుండీల ద్వారా ఆరు నెలల పాటు రూ. 1.43,678 సొమ్ము లభించినట్లు ఈఓ తెలిపారు. సొమ్ము లెక్కింపులో అర్చకులు, సిబ్బంది, భక్తులు, మాజీ చైర్మన్ కె.ఉమేష్, మాజీ ధర్మకర్త అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతో పాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వెలమవారిపల్లెకు సీసీ రోడ్డు



వెలమవారిపల్లెలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం నుంచి వెలమవారిపల్లెకు వెళ్లే పాత రోడ్డు అధ్వానంగా ఉందని సాక్షి దిన పత్రికలో వార్త ప్రచురితమైన విషయం విధితమే. ఈ రోడ్డు అధ్వానంగా ఉండటంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి నూతనంగా సిమెంటు రోడ్డును నిర్మించారు. దీంతో వాహనదారులు, స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలలో మూడవ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు.

గురువారం స్థానిక ఇడుపులపా య ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో బెంగళూరుకు చెందిన ప్రముఖ ఇంటెన్ కంపెనీ ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలు నిర్వహించగా. నెలకు రూ.45వేల స్టయిఫండ్‌తో 7 మంది ఈసీఈ తృతీయ సంవత్సర ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంపిక కావడం జరిగిందన్నారు. విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడంపట్ల డైరెక్టర్‌తోపాటు పరిపాలన అధికారి రవికుమార్, ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ వినోద్ కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుందర్, ఈసీఈ బ్రాంచ్ ప్రొఫెసర్లు బి.వి.సుధాకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, మదన్‌కుమార్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులకు అభినందించారు.

చెప్పిన వాగ్దానం నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు, సీపీఐ నాయకులు

ఎర్రగుంట్ల : ఎన్నికల ముందు ఆటో కార్మికులకు చెప్పిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు చెల్లించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కంటే ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెరుగైన పథకాలకు ఆటో కార్మికులు వర్తింపచేస్తామని ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారని వాటిని వెంటనే నెరవేర్చాలన్నారు. డిగ్రీలు, పీజులు చేసి ఉద్యోగ అవకాశాలు లేక సొంత పెట్టుబడితో ఆటోలు తీసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎం.నారాయణ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఈ.శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన టెన్త్ విద్యార్థులకు చేయూత

సింహాద్రిపురం : మండలంలో పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థులకు వైజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిస్తోందని ఆ ట్రస్ట్ చైర్మన్ ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా ఉన్న 8 ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు ప్రోత్సాహకాలను అందించామన్నారు. అలాగే మండలంలో చదువులైన డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లమో కోర్సులలో చదవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ముగ్గురు గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులను గుర్తించి వారికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఈ ఏడాది నుంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు రానీ విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యమన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ



విద్యార్థులకు స్టడీ కిట్లను అందిస్తున్న హెచ్ఎం రామాంజనేయులు

ఎర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 169 మంది విద్యార్థులకు ప్రొద్దుటూరు స్టార్ రైజ్ ఫైనాన్స్ ఆండర్ షేర్స్ వ్యవస్థాపకులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ కిట్‌లను పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగ చదవి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కన్వీనర్ మహిళలు

ఎర్రగుంట్ల : మహిళలకు రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చాయని వాటిని ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కన్వీనర్ శ్యామలదేవి తెలిపారు. గురువారం మహిళా దినోత్సవంను పురస్కరించుకుని మున్సిపల్ కమిషనర్ శేషఫణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాలలో వివిధ హోదాలలో పనిచేస్తున్న మహిళలు రక్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారన్నారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి మహిళ ఉద్యోగులు హాజరు కావాలన్నారు.

మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలి

పులివెందుల టౌన్ : మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ, హిందుస్తాన్, కోకో కోలా బేవరేజెస్ సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు సేల్స్ అండ్ మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ వృత్తి విద్యకు సంబంధించి సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థులలో ఆలోచనలు, నైపుణ్యాలు మెరుగుపడుతాయన్నారు. అనంతరం ప్రాజెక్టు మేనేజర్ ఖలీల్‌బాషా మార్కెటింగ్ స్కిల్స్ గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.నారాయణరెడ్డి, ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ కేశవ, కళాశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయానికి కొత్త శోభ



మున్సిపల్ కార్యాలయ ప్రహరీలపై వేసిన చిత్రాలు

కమలాపురం : స్థానిక మున్సిపల్ కార్యాలయానికి కొత్త శోభ సంతరించుకుంది. కార్యాలయ గోడలపై స్వచ్ఛ భారత్, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, సే నో ప్లాస్టిక్, వేస్ట్ మేనేజ్‌మెంట్, రీ సైక్లింగ్ తదితర అంశాలకు సంబంధించిన చిత్రాలను అందంగా చిత్రీకరించారు. ఈ చిత్రాల ద్వారా పట్టణ ప్రజలకు పారిశుద్ధ్య ప్రమాణాలపై అవగాహన కలిపిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో స్పందించాలని ఆయన తెలిపారు. కాగా మున్సిపల్ కార్యాలయ ప్రహరీపై ఉన్న ఈ చిత్రాలను రోడ్డు పై వెళ్తున్న ప్రయాణీకులు, పాదాచారులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలి



జిల్లా ఎస్పీని కలిసిన ప్రొబేషనరీ ఎస్ఐలు

కడప అర్బన్: అనంతపురం పోలీసుశిక్షణ కళాశాలలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని, జిల్లాకు కేటాయించిన 7 మంది ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలోకి కొత్తగా చేరుతున్న ప్రొబేషనరీ ఎస్ఐలు రేనాటి శివనాగిరెడ్డి, జి. సూర్యనారాయణ రెడ్డి, ఎం. నాగకీర్తన, ఎం. సుబహాన్‌లకు ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజలకు అత్యుత్తమ పోలీస్ సేవలు అందించి, పోలీస్‌శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించేలా విధి నిర్వహణ చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల గురించి అవగాహన పొందినందున సాంకేతికతను వినియోగించుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి

కడప ఎడ్యుకేషన్: మండల వనరుల కేంద్రంలో పని చేసే ఎమ్మార్సీ స్టాఫ్ పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని మండల వనరుల కేంద్ర జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం కడప మండల వనరుల కేంద్రంలో పనిచేసే సిబ్బందితోపాటు సీఆర్పీలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎంఆర్‌సీ స్టాఫ్ పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. అలాగే హెచ్ఆర్ పాలసీ అమలు చేయడంతోపాటు మినిమం టైం స్కేల్‌ను అమలు చేస్తూ అసెంబ్లీలో ప్రకటన చేయాలన్నారు.

పోస్టల్ శాఖ పథకాలు, సేవలను ఉపయోగించుకోవాలి



సచిన్ మిట్టల్‌తో మెప్మా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు

చింతకొమ్మదిన్నె : స్థానిక వెలుగు కార్యాలయంలో పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాల గురించి మహిళా సంఘ సభ్యులతో పోస్టల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సచిన్ మిట్టల్ గురువారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పోస్టల్ శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాలైన సుకన్య సంవృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్, ఇన్సూరెన్స్ వంటి అనేక పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనందనాయక్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు పని చేస్తున్న జీవనోపాదుల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగం పోస్టల్ పథకాలలో పొదుపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్, మండల వెలుగు ఏపీఎం వెంకటరమణరాజు, సీసీలు, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైవీయూలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన లభించింది. యోగి వేమన విశ్వవిద్యాలయ ప్లేస్ మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి. విజయభారతి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో గురువారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. డ్రైవ్ ను విశ్వవిద్యాలయ ప్రధాన ఆచార్యులు ఎస్ రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ ప్రారంభించారు. దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, శ్రీ చైతన్య స్కూల్స్ ప్రతినిధులు రాత పరీక్ష ఇంటర్వ్యూ, డెమో ద్వారా వారి సంస్థలకు అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ గణేష్ నాయక్, డాక్టర్ కె. లలిత పాల్గొన్నారు. హైదరాబాద్ దివీస్ లేబరేటరీ సంస్థతో వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ పరస్పర ప్రయోజనాల కోసం అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు.

విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ, కార్యశాలల ద్వారా నైపుణ్యాలను పెంపొందిస్తారని ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి వెల్లడించారు.

అధ్వానంగా రహదారి



గుంతలు పడి కంకర గులక రాళ్లు కనిపిస్తున్న ఎర్రగుంట్ల-కోగటం రహదారి

ఎర్రగుంట్ల : మండలంలోని ఎర్రగుంట్ల-కోగటం గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. పట్టణం నుంచి సుందరయ్యకాలనీ మీదుగా కమలాపురం మండలం పరిధిలో ఉన్న కోగటం గ్రామానికి రహదారి ఉంది. ఈ దారి ప్రస్తుతం చాలా గుంతలు పడి గులకరాళ్లు బయటకు వచ్చాయి. ఈ గ్రామాల మధ్య నిత్యం కూలీ పనులు చేసుకోవడానికి కార్మికులు ఎర్రగుంట్లకు వస్తుంటారు. వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయించి తారు రోడ్డు నిర్మాణం చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.